

పశ్చిమాన..నీటి రక్షణ

ఎల్‌నినో ప్రభావంతో జిల్లా పశ్చిమ ప్రాంతంలో అడుగంటిన భూగర్భ జలాలను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- 8లో..



ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.5/25.5

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అసత్య ప్రచారాన్ని ఖండించిన జంకె

ఒంగోలు: తనపై ఒక దినపత్రికలో ప్రచురించిన అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. కేవలం ఊహాగానాలతో వార్తలను ప్రచురించడం సరికాదన్నారు. తనకు సీఎంవో అక్షింతలు వేసింది, దానికి తాను కినుక వహించి పార్టీ మారుతున్నట్లు ప్రకటించడం, ఆపై జిల్లా అధ్యక్షుడ్ని మారుస్తున్నట్లుగా పేర్కొనడం ఎంతవరకు సమంజసం అన్నారు. తనకు అక్షింతలు వేసినట్లు సీఎంవో ప్రకటించిందా లేక మీ ఇష్టం వచ్చినట్లు మీరు ఊహించుకుంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు, పార్టీ అభిమానులకు వాస్తవాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో తాను వివరణ ఇస్తున్నానని, అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు.

వైద్య అధికారుల ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు టౌన్: జిల్లా పరిధిలోని వివిధ విభాగాల్లో వైద్యాధికారులుగా విధులు నిర్వహించేందుకు ఎంబీబీఎస్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూపీహెచ్‌సీ-4 , ఎన్‌ఆర్‌సీ-1 ఉద్యోగాలకుగాను అర్హతగల అభ్యర్థులు ఈనెల 30 నుంచి డిసెంబరు 2వ తేదీలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటుగా ఒక జత నకలు పత్రాలతో జిల్లా వైద్య శాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తుతో పాటుగా ఓసీ, ఈడబ్ల్యూఎస్, బీసీ అభ్యర్థులు 500 డీడీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు 300 డీడీని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, ఒంగోలు పేరు మీద తీసుకొని జత పరచవలిసి ఉంటుందని పేర్కొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురు, శుక్రవారాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక కొప్పోలు-గుత్తికొండవారిపాలెం మధ్య ఉన్న పోతురాజు కాలువపై నూతన వంతెన భవన ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 11 గంటలకు సింగరాయకొండ మండలం పాకల గ్రామంలో కేంద్ర ప్రభుత్వం వారి వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మార్కాపురంలో ఎమ్మెల్యేతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు ఒంగోలు పీవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో మాగుంట సుబ్బరామరెడ్డి 28వ వర్ధంతి సందర్భంగా అభిమానులు ఏర్పాటుచేసే సంస్మరణ సభ, అన్నదాన ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో జరిగే వైద్యశాల అభివృద్ధి సొసైటీ సమావేశంలో పాల్గొంటారు. డిసెంబర్ ఒకటవవ తేదీ ఉదయం 9గంటలకు నగరంలోని వివిధ ప్రదేశాల్లో మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి సందర్భంగా అభిమానులు ఏర్పాటుచేసే విగ్రహాలకు, చిత్రపటాలకు పుష్పమాలంకరణ, పీవీఆర్ బాలుర మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే సంస్మరణ సభ, అన్నదానం, ఉచిత మెగా వైద్య శిబిర నిర్వహణ కార్యక్రమంలో పాల్గొంటారు.

జాతీయస్థాయి మిల్లెట్ శిక్షణకు తాళ్లూరు ఏఓ



ప్రశంస పత్రం అందుకుంటున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (ముండ్లమూరు): జాతీయ స్థాయి మిల్లెట్ శిక్షణ కార్యక్రమంలో తాళ్లూరు మండల వ్యవసాయాధికారి బీ ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు హైదరాబాద్‌లో జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైనింగ్ ప్రోగ్రాం ఆన్ మిల్లెట్ బేస్డ్ వాల్యూచైన్ డెవలప్‌మెంట్ (చిరుధాన్యాలకు విలువ ఆధారిత గొలుసు అభివృద్ధిపరిచే శిక్షణ) కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రసాదరావును ఎంపిక చేశారు. ప్రసాదరావు రాష్ట్రంలోనే అత్యుత్తమంగా చిరుధాన్యాల సాగుపై వందల మంది రైతులకు అవగాహన కల్పించి ప్రతికూల పరిస్థితుల్లోనూ సాగు చేసేలా చర్యలు తీసుకున్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం ఐవైఎం 2023లో భాగంగా మినీకిట్లు పంపిణీ చేయడం, చిరుధాన్యాల పొలంబడులు నిర్వహించడం పంట కోత ప్రయోగాలు, నిల్వలు తగు జాగ్రత్తలు పాటించడం, పోషక విలువలపై వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించినందుకు ప్రసాదరావును ఎంపిక చేశారు.

పల్లె రక్షణ కవచం

గ్రామ సచివాలయ మహిళా పోలీసు.. క్షేత్ర స్థాయిలో మహిళల రక్షణ విషయంలో వీరిది కీలక భూమిక. మా గ్రామానికి మేమే కాపలా అంటూ ధీమాగా విధులు నిర్వహిస్తున్నారు. స్థానికంగానే నివాసం ఉంటూ.. చిన్న చిన్న సమస్యలనే కాకుండా గ్రామాల్లో జరుగుతున్న కీలక సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీస్ ఉన్నతాధికారులకు చేరవేస్తూ విధి నిర్వహణలో ముందుకు దూసుకెళ్తున్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు మహిళలకు రక్షణ చట్టాల గురించి తెలియజెబుతూ వారిలో చైతన్యం తీసుకొస్తున్నారు. "మా గ్రామం.. మా మహిళా పోలీస్'' అని గుర్తింపు పొందుతున్నారు.

- శాంతి భద్రతల్లో కీలకంగా మహిళా పోలీస్
- స్వగ్రామంలోనే కొలువు.. నిరంతర పర్యవేక్షణ
- ఉన్నతాధికారులకు ఆఘమేఘాల మీద సమాచారం
- ప్రజల్లో దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తూ ముందుకు
- చట్టాలపై అవగాహన పెంచుకొని మహిళలకు అవగాహన కల్పిస్తూ..



శిక్షణ సందర్భంగా మహిళా పోలీసులతో ఎస్పీ మలికాగర్గ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మహిళా సాధికారతే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలనిస్తున్నాయి. బాపూజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సచివాలయాల్లో వివిధ కార్యదర్శులతోపాటు ఒక మహిళా పోలీస్‌ను కూడా ప్రత్యేకంగా నియమించారు. ఆ గ్రామానికి రక్షకురాలి బాధ్యతలు అప్పగించారు. వారు రెగ్యులర్ పోలీసులకు ఏమాత్రం తీసిపోకుండా ధీమాగా విధులు నిర్వర్తిస్తున్నారు. స్థానికంగానే నివాసం ఉంటూ.. చిన్న చిన్న సమస్యలనే కాకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు, అల్లరి మూకల వికృత చేష్టలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని వెంటనే పోలీస్ ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు. తద్వారా శాంతి భద్రతల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటి వరకు పోలీసులు వెళ్లని గ్రామాల్లో సైతం నేడు మహిళా పోలీస్‌లు విధులు నిర్వర్తిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. గతంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలన్నా లేదంటే ఎస్సై ఫోన్ నంబర్ కావాలన్నా గ్రామంలో పెద్దలనో, మోతుబరినో అడగాల్సి వచ్చేది. మహిళా పోలీసుల నియామకంతో అలాంటి అవసరమే లేకుండా పోయింది. సమస్యలపై ఫిర్యాదు చేయడానికి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని వారు మహిళా పోలీస్ సాయంతో స్టేషన్‌కు నిర్భయంగా వెళ్లగలుగుతున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 969 మంది:

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం 969 మంది మహిళా పోలీసులు పనిచేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది నెలలకే.. అంటే 2019 అక్టోబర్‌లో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. రెండు విడతల్లో సిబ్బంది ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1058 మందిని మహిళా పోలీసులుగా నియమించగా వారిలో కొందరు ఇతర ఉద్యోగాల్లో చేరారు. ముగ్గురు మృతి చెందారు. ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 969 మంది మహిళా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు.

డ్రౌనింగ్‌పై 520 అవగాహన సదస్సులు:

వేసవిలో చిన్నారులు కుంటలు, వాగులు, వంకలు, నదులు, కాలువల్లో ఈత కొట్టేందుకు అమితాసక్తి చూపుతారు. ఈ క్రమంలో జిల్లాలో పలుచోట్ల ప్రమాదాలు జరిగి చిన్నారులు మృతి చెందారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా నిరోధించేందుకు మహిళా పోలీసులతో గ్రామాలు, పట్టణాల్లో డ్రౌనింగ్ క్యాంపెయిన్ నిర్వహించారు. సెలవులకు ఇంటికి వచ్చిన చిన్నారులను ఒకచోటకు చేర్చి నీటి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 520 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చిన్నారులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకున్నారు.

ఉద్యమంలా అవగాహన కార్యక్రమాలు:

గ్రామాలు, వార్డుల్లో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి మహిళా పోలీసుల సాయంతో ఎస్పీ మలికాగర్గ్ అవగాహన కార్యక్రమాలను ఒక ఉద్యమంలా చేపట్టారు. దాదాపు 21 టాస్కులు రూపొందించి వాటిపై మహిళా పోలీసుల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించారు. బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, దిశ యాప్, రోడ్డు భద్రతా నియమాలు.. ఇలా ప్రతి అంశంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు.

55 బాల్య వివాహాల అడ్డగింత

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 55 బాల్య వివాహాలను మహిళా పోలీసులు అందించిన సమాచారంతో ఐసీడీఎస్, పోలీస్ అధికారులు అడ్డుకున్నారు. బాల్య వివాహం చేస్తున్నారని తెలిసిన వెంటనే అటు ఐసీడీఎస్, ఇటు పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా ముక్కుపచ్చలారని చిన్నారులను వివాహ బంధం అనే చెర నుంచి విముక్తులను చేశారు.

ఒంటరి మహిళలకు రక్షణగా..

గ్రామాలు, పట్టణాల్లో ఒంటరిగా ఉండే మహిళలను ఆకతాయిలు వేధించకుండా మహిళా పోలీసులు రక్షణగా నిలుస్తున్నారు. ఒంటరిగా ఉంటున్న మహిళలను గుర్తించి హత్య చేసి డబ్బు, నగదు దోచుకున్న ఉదంతాలు జిల్లాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో 931 మంది ఒంటరి మహిళలను గుర్తించిన సచివాలయ మహిళా పోలీసులు దిశ యాప్‌పై అవగాహన కల్పించి, తరచూ వారి ఇళ్లను సందర్శిస్తున్నారు. కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు వెంటనే సమాచారం ఇవ్వాలని చెప్పి వారికి భరోసా కల్పించడం ద్వారా పోలీస్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచారు.



ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా పోలీసులతో ఎస్పీ మలికాగర్గ్ (ఫైల్)

మహిళల సమస్యలు చాలా తెలుసుకున్నాం..



మహిళా సంరక్షణ పోలీస్ ద్వారా ప్రధానంగా మహిళలకు ఉన్న ఎన్నో సమస్యలను తెలుసుకున్నాం. ప్రజలకు దగ్గరగా వెళ్లి వారి సమస్యల పరిష్కారానికి పూనుకున్నాం. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నాం. జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు బాగా ప్రోత్సహించారు. నాలుగు సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేస్తున్నాను. చిన్న పిల్లల సమస్యలను కూడా తెలుసుకొని పరిష్కరించే అవకాశం కలిగింది. సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించి ఆ సమస్య పరిష్కారమైతే వాళ్లలో ఆనందం చూశాం.

– అల్లాడి వాణి, రాజాపానగల్ రోడ్డు సచివాలయం-4, ఒంగోలు

ఆత్మహత్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాం



పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి ఆత్మహత్యలపై అవగాహన కల్పించాం. ఆత్మహత్యలకు పాల్పడబోతున్న వారిని గుర్తించి వారికి భవిష్యత్తు ఎంత గొప్పదో తెలియజేశాం. ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్నట్లు సమాచారం రాగానే వెళ్లి ఆ విద్యార్థితో స్వయంగా మాట్లాడా. వారం రోజుల పాటు కౌన్సెలింగ్ ఇచ్చా. ఇప్పుడు ఆ విద్యార్థి ఉత్సాహంగా చదువుకుంటున్నాడు. ఈ విధంగా మహిళలు బయటకు చెప్పుకోలేని సమస్యలను పరిష్కరించే అవకాశం కలిగింది.

– ఆవుల నాగ అనిత, సచివాలయం-4, దర్శి



మహిళా పోలీసుల టాస్క్‌ల వివరాలు

ప్రధాన రోడ్డు మార్గాల్లో పనిచేయని సీసీ కెమెరాల గుర్తింపు	357
సైబర్ క్రైంపై నమోదు చేసిన ఫిర్యాదులు	14
దిశ యాప్ రిజిస్ట్రేషన్	19,217
పోలీస్ రిజిస్ట్రేషన్ లేని ఆటోల గుర్తింపు	629
సీనియర్ సిటిజన్లు	4,189
నంబర్ లేని ట్రాక్టర్లు, ట్రాలీలు	6
బైక్‌పై ట్రిపుల్ రైడింగ్	468
ఈవ్ టీజింగ్‌కు జరుగుతున్న ప్రాంతాలు	38
పేకాట స్థావరాలు	27
నాటుసారా కాసే ప్రాంతాలు	3
లాక్డ్ హౌస్‌లు	14,869
నంబర్ ప్లేట్ లేని వివిధ రకాల వాహనాలు	6,302
ప్రధాన రోడ్ల వెంట ఇళ్లకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని గుర్తించినవి	850 ఇళ్లు
శాంతి భద్రతల సమస్యను ముందుగా గుర్తించి ఉన్నతాధికారులకు చెప్పినవి	6 గ్రామాలు
గ్రామాలు, వార్డుల్లో కొత్త వ్యక్తుల సమాచారం	4,848
పోలీస్ స్టేషన్లకు వెళ్లలేని వారి పిటిషన్లు ఉన్నతాధికారులకు పంపినవి	68
అదృశ్యమైన వ్యక్తుల గుర్తింపు	16
రికవరీ చేసిన సెల్ ఫోన్లు	709



బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక శిక్షణ

మహిళా సంరక్షణ పోలీస్‌గా నాకు బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేకంగా అనేకరకాల టాస్క్‌లు ఇచ్చారు. వాటిలో ఎనిమిదింటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రశంస పత్రాలు ఇచ్చి ప్రోత్సహించారు. దిశ యాప్ రిజిస్ట్రేషన్‌లో 4, ఇతర టాస్క్‌ల్లో మరో 4 ప్రశంస పత్రాలు వచ్చాయి. పెళ్లి విషయంలో ఎన్‌ఆర్‌ఐ మాట్రిమోనీ ద్వారా జరుగుతున్న మోసాల నివారణలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజలకు సేవలు చేసేందుకు నియమించటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా.

– పైడి భారతి, సచివాలయం-4, సింగరాయకొండ

జెడ్పీ కార్యాలయాన్ని మార్చేందుకు చర్యలు

- తాత్కాలిక డీపీఆర్సీ భవనంలోకి మార్పు
- కలెక్టర్ దినేష్ కుమార్
- నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న బాలినేని, ఆదిమూలపు, వెంకాయమ్మ



నూతన జెడ్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

ఒంగోలు సిటీ: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయాన్ని తాత్కాలికంగా డీపీఆర్సీ భవనంలో మార్చేందుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ ఏ.ఎస్. దినేష్‌కుమార్ తెలిపారు. జెడ్పీ కార్యాలయ తాత్కాలిక భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్‌కుమార్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొని బుధవారం నూతన భవన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న జెడ్పీ కార్యాలయ భవనం విధులు నిర్వహించడానికి అనుకూలంగా లేదని, ప్రమాదకరంగా ఉన్న కారణంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా నూతన భవన నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. జెడ్పీ నూతన భవనం ఏర్పడే వరకు ఉద్యోగుల సంక్షేమం, భద్రత దృష్ట్యా అసంపూర్ణంగా ఉన్న డీపీఆర్సీ భవనాన్ని ఆర్జీఎస్‌ఏ నిధుల నుంచి రూ.2 కోట్లు, జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుండి రూ.1.40 కోట్లు కలిపి మొత్తం రూ.3.40 కోట్లతో పూర్తి చేసి అందులోకి మారుస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్ కుమార్, నగర మేయర్ గంగాడ సుజాతను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయాన్ని రూ.70 లక్షలతో ఆధునికీకరణ చేసి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ అధికారికంగా ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యం

- చందలూరు పారిశ్రామిక పార్కు కోసం 102.08 ఎకరాలు
- కలెక్టర్ దినేష్ కుమార్



చందలూరు ఇండస్ట్రియల్ పార్క్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్

ఒంగోలు అర్బన్: పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు, అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక, ఎంఎస్‌ఎంఈ పార్కులు, ఆటోనగర్‌లకు బుధవారం వర్చువల్ విధానంలో తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ దినేష్‌కుమార్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఉపాధ్యాయ ఎంఎల్‌సీ చంద్రశేఖర్‌రెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం దర్శి మండలంలోని చందలూరు గ్రామంలో నిర్మించే పారిశ్రామిక పార్కు శిలఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చందలూరు పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు 102.08 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి ఏపీఐఐసీకి కేటాయించామన్నారు. అందులో 50 ఎకరాలు ఎంఎస్ఎంఈ పార్కు కోసం, మిగిలిన భూములను పారిశ్రామిక పార్కుకు ప్రతిపాదించామన్నారు. ఎంఎస్‌ఎంఈ-సీడీపీ పథకం కింద ఎంఎస్‌ఎంఈ పార్కు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.10.76 కోట్లు కాగా కేంద్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు, ఏపీఐఐసీ రూ.3.22 కోట్లు మంజూరు చేశాయన్నారు. ప్రాజెక్టు కింద బీటీ రోడ్లు, సైడ్ కాలువలు, స్ట్రీట్ లైట్లు, అంతర్గత రోడ్లు నిర్మిస్తామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా పారిశ్రామిక వసతులు కల్పించడంలో దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను వినియోగించుకోవాలని పరిశ్రమల నిర్వాహకులకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సూచించారు. దీనిలో జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ బి శ్రీనివాసరావు, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం

- జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత
- ఘనంగా దివ్యాంగుల క్రీడా పోటీలు



క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత



ట్రై సైకిల్ పందెంలో పోటీపడుతున్న దివ్యాంగులు

ఒంగోలు సెంట్రల్: క్రీడలు దేహ ధారుడ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు డీఆర్‌ఎం హైస్కూల్‌లో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి ప్రసంగించారు. దివ్యాంగులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. ఆ శాఖ సహాయ సంచాలకులు జీ అర్చన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు మానసిక, శారీరక స్థైర్యం కల్పించేందుకు ప్రభుత్వం డిసెంబర్ 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం దివ్యాంగులకు పరుగు పందెం, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్ పుట్, డిస్కస్ త్రో, జావిలిన్ త్రో, చదరంగం, ట్రై సైకిల్స్ పోటీ, క్యారమ్స్, క్రికెట్, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ధనలక్ష్మి, బీసీ వెల్ఫేర్ అధికారి అంజలి, డీఎల్‌డీవో ఉషారాణి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్ రాజేశ్వరి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ సునీల్ ఖన్నా, బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పలు స్వచ్ఛంద సంస్థలు, విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ఓటరు జాబితా సవరణలో ఎటువంటి లోపాలు లేకుండా పక్కాగా రూపొందించాలని అందుకు సంబంధిత అధికారులు, ఉద్యోగులు పారదర్శకంగా పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికలకు సంబంధించిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారిని ఓటర్ల జాబితాలో చేర్చేందుకు డిసెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపెయిన్‌లలో బీఎల్‌ఓలు, ఇతర సిబ్బంది విరివిగా సేవలందించాలన్నారు. ఓటరు జాబితా సవరణకు డిసెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. క్లెయిమ్‌లను డిసెంబర్ 26వ తేదీ నాటికి పరిష్కారం చేస్తామన్నారు. పెండింగ్ క్లెయిమ్‌ల పరిష్కారం, డోర్ నంబర్ల పొరపాట్లు, ఒకే డోర్ నంబర్‌లో 10 మందికి పైగా ఓటర్లు ఉండటం వంటి అనామలీస్‌ను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వీటిపై బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై రాజకీయ పార్టీలు సహకరించాలని అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేలా చూడాలని సూచించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్, ఈఆర్‌ఓలు, ఎలక్షన్ డీటీలు, వైఎస్‌ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషా, స్వరూప్, రాజశేఖర్, సత్యం, రసూల్, రఘురామ్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ల్యాబ్ టెక్నీషియన్ మృతి


తాడి కేశవ(ఫైల్)

మార్కాపురం: పట్టణంలోని నెహ్రూ బజారులో విజయ లక్ష్మీ ల్యాబొరేటరీ యజమాని తాడి కేశవ(47) బుధవారం వేకువజామున ఉరేసుకుని మృతి చెందారు. అందిన సమాచారం మేరకు.. కేశవ ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. జిల్లా వైద్యశాలలో టీబీ డిపార్ట్‌మెంట్‌లో ల్యాబ్ సూపర్‌వైజరుగా విధులు నిర్వర్తించినట్లు తెలిసింది. టౌన్ ఎస్సై కోటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మీ జవాన్ మృతి

గిద్దలూరు రూరల్: విధినిర్వహణలో ఉన్న ఆర్మీ జవాన్ అనారోగ్యంతో మృతి చెందాడు. వివరాలు.. గిద్దలూరు మండలం కె.ఎస్.పల్లెకు చెందిన షేక్ అబ్దుల్ ఖాదర్ (32) అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని మంచు ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తుండగా ఉన్నట్టుండి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ఖాదర్ మృతి చెందినట్లు స్థానిక కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వారితో మాట్లాడినా.. ఇంటికెళ్లినా జరిమానా..!

- తిరునాళ్లకు డబ్బులు చెల్లించని కుటుంబాలకు రూ.10 వేలు జరిమానా
- దండోరా వేయించిన గ్రామ పెద్దలు


కాలనీలో దండోరా వేస్తున్న దృశ్యం


సింగరాయకొండ (మర్రిపూడి): మాతమ్మ తిరునాళ్లకు డబ్బులు చెల్లించని ఆ కుటుంబాలతో మాట్లాడినా.. వారి ఇళ్లకు వెళ్లిన వారికి రూ.10 వేలు జరిమానా విధిస్తామని ఆ కాలనీ గ్రామ పెద్దలు దండోరా వేసిన ఘటన సింగరాయకొండ మండలంలోని శానంపూడి పంచాయతీ అరుంధతి నగర్‌లో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... శానంపూడి గ్రామ పంచాయతీలోని అరుంధతి కాలనీ వాసులు ఇటీవల 5 సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే మాతమ్మ తిరునాళ్ల జరిపారు. తిరునాళ్లకు ఆ కాలనీలోని ప్రతి ఇంటి వారు చందాలు వేసుకుంటారు. అయితే ఆ కాలనీలోని 17 కుటుంబాలవారు చందాలు ఇవ్వకపోవడంతో గ్రామ పెద్దలు తీర్మానం చేసుకుని కాలనీలో దండోరా వేయించారు. ఈ 17 కుటుంబాల వారు చర్చికి కూడా వెళ్లడానికి వీలు లేదని ఆదేశించారు. దీనిపై ఆయా కుటుంబాల వారు తమకు న్యాయం కావాలని కోరుతూ పోలీస్, రెవెన్యూ శాఖల వారిని ఆశ్రయించారు. దీనిపై పోలీసులు సమస్య పరిష్కారానికి తహశీల్దార్‌ను కలవాలని సూచించడంతో వారు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో తహశీల్దార్ ఉష.. కలెక్టర్ దినేష్‌కుమార్ పాకల గ్రామానికి వస్తున్నారని, తెలియడంతో అక్కడికి వెళ్లారు. దీంతో కార్యాలయ సిబ్బంది గురువారం తహశీల్దార్‌ను కలవాలని వారికి సూచించారు.

పశ్చిమాన.. నీటి రక్షణ!



సాక్షి, ప్రకాశం డెస్క్

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాభావం తలెత్తడంతో పశ్చిమ ప్రకాశంలో భూగర్భ జలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. ఉపరితల నీటి వనరులు లేని ఈ ప్రాంతంలో రైతులు పంటల సాగు చేసేందుకు భూగర్భ జలాలు, మైనర్ ఇరిగేషన్ చెరువులపైనే ఆధారపడుతుంటారు. అయితే ప్రకృతి అనుకూలించక సరైన వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. ఈ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులపై సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ఇటీవల అధ్యయనం చేసింది. ఆ నివేదిక ఆధారంగా పశ్చిమ ప్రకాశంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సూచన మేరకు వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ఉపక్రమించింది. నీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్లతో మంచినీరు సరఫరా చేస్తూనే చెక్ డ్యాములు, నీటి కుంటల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చెరువులకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టడంపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. రైతులకు సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పైపులు, స్ప్రింక్లర్లు అందిస్తూ నీటి వనరులు వృథా కాకుండా చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



భూగర్భ జలాల లభ్యత వివరాలు

మండలం	గతేడాది		ప్రస్తుతం	
	సెప్టెంబర్ (మీటర్లలో)	అక్టోబర్ (మీటర్లలో)	సెప్టెంబర్ (మీటర్లలో)	అక్టోబర్ (మీటర్లలో)
మార్కాపురం	20.5	18.0	25.8	9.0
అర్ధవీడు	6.2	5.8	11.0	12.4
దోర్నాల	41.0	38.7	47.5	45.2
కంభం	7.1	4.1	11.9	13.0
గిద్దలూరు	20.0	20.2	39.1	7.9
పెద్దారవీడు	27.9	27.6	41.3	23.5
పుల్లలచెరువు	40.5	34.8	51.4	7.4
వై.పాలెం	51.9	38.1	41.1	41.1

- భూగర్భ జలాల వినియోగం పశ్చిమ ప్రకాశంలోనే అధికం
- క్రమంగా అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వాల్టా చట్టం పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- నీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా మంచి నీరు సరఫరా
- సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సూచనల అమలుపై దృష్టి సారించిన అధికారులు
- చెరువుల మరమ్మతులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నీటి కుంటల తవ్వకానికి ప్రతిపాదనలు


మార్కాపురం ప్రాంతంలో బోరు బండి

స్వల్పంగా భూగర్భ జలాలు

పశ్చిమ ప్రకాశంలో డీప్ బోర్లు అడుగంటడంతో పంటల సాగుపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. చాలా ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 400 మీటర్ల లోతులో నీటి లభ్యత ఉండటమే అందుకు కారణం. ఈ నేపథ్యంలో భూగర్భ జలాల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర భూగర్భ జలాల శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం, గ్రామీణ నీటి సరఫరా అధికారుల సర్వే ప్రకారం పశ్చిమ ప్రకాశంలోని ఏడు మండలాల్లో గల పలు గ్రామాల్లో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. వ్యవసాయ బోరుబావుల సాంద్రతతో పోల్చితే తాగునీటి సరఫరా బోరు బావులు సగటున 5 నుంచి 10 బోరుబావుల సాంద్రతతో ఉన్నాయి.

వ్యవసాయ బోర్లలో నీటి లభ్యత 400 మీటర్ల లోతు వరకు వెళ్లినా కష్టంగా ఉంటోంది. సర్వే చేసిన పలు ప్రాంతాల్లో అన్ని ట్యాంకులు ఎండిపోయాయని, వాగులు, చెరువుల్లోకి ఉపరితల ప్రవాహాలు లేకపోవడంతో బోరుబావులు పనికిరాకుండా పోయినట్లు సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు తన నివేదికలో పేర్కొంది. బోర్డు సూచనలతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తోంది. అదే సమయంలో ఇష్టారీతిగా డీప్‌బోర్లు తవ్వకుండా అడ్డుకునేందుకు వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు

భూగర్భ జలాల పెంపుదలకు జిల్లా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మైక్రో ఇరిగేషన్, డ్రిప్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. దీని వల్ల 2 ఎకరాలకు ఉపయోగించే నీరును డ్రిప్ సిస్టమ్ ద్వారా 5 ఎకరాల వరకు పారించుకోవచ్చు. మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు. కొత్త బోర్లను నిషేధించారు(తాగునీటి అవసరాలకు మాత్రమే అనుమతి ఉంది). 427 చెరువులకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాల్సి ఉందని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సూచించడంతో ఆ దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

డ్రిప్‌తో పంటలు సాగు చేయండి



వర్షాలు లేక భూగర్భజలాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు డ్రిప్ సిస్టమ్ వినియోగించాలి. వర్షం నీటిని నిల్వ చేసుకునేందుకు రైతులు పొలాల్లో కుంటలు ఏర్పాటు చేసుకోవాలి. వీలైనంత వరకు మొక్కలు నాటాలి. వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నాం. అధికారులు భూగర్భ జలాల వాడకం పైగ్రామ మండల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు కూడా విచ్చలవిడిగా బోర్లు వేసి నీటిని వృథా చేయడం మానుకోవాలి.

– విద్యా సాగర్, గ్రౌండ్ వాటర్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్, ఒంగోలు

భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో ఉన్న గ్రామాలివే..

మండలం	గ్రామాలు/పట్టణాలు
మార్కాపురం	మార్కాపురం టౌన్, నికరంపల్లి, గజ్జలకొండ,
కంభం	కంభం, తురిమెళ్ల
దోర్నాల	చిన్నదోర్నాల, దోర్నాల, యడవల్లి, పెద్ద బొమ్మలాపురం
గిద్దలూరు	గిద్దలూరు కృష్ణంశెట్టిపల్లి, ముండ్లపాడు, సంజీవరాయునిపేట తదితర గ్రామాలు
పెద్దారవీడు	పెద్దారవీడు, కంబంపాడు, దేవరాజుగట్టు, తోకపల్లె
పుల్లలచెరువు	పుల్లలచెరువు, కవలకుంట్ల, మరివేముల, ముటుకుల, ఎండ్రపల్లె
యర్రగొండపాలెం	వైపాలెం, బోయలపల్లి, వెంకటాద్రిపాలెం

ఏపీ వాల్టా చట్ట ప్రకారం ఈ గ్రామాల్లో తాగునీటికి తప్ప ఇతర బోరుబావుల తవ్వకాలు, డీప్‌బోర్లు, ఇసుక తవ్వకాలను ప్రభుత్వం నిషేధించింది.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

- టెన్త్ విద్యార్థులకు కలెక్టర్ దినేష్‌కుమార్ సూచన
- జెడ్పీ నిధులు రూ.17 లక్షలతో మెటీరియల్, స్టేషనరీ పంపిణీ
- ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి సురేష్, ఎమ్మెల్యే బాలినేని


పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సిటీ: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికబద్ధంగా సన్నద్ధమైతే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ నూతన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, స్టేషనరీ పంపిణీ చేశారు. జెడ్పీ సాధారణ నిధులు రూ.17 లక్షలతో వరుసగా మూడో ఏడాది 2,125 మందికి ఆల్ ఇన్ వన్ మెటీరియల్, పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రీ బాక్సు, ఎగ్జామ్ ప్యాడ్, స్కెచ్ పెన్నులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, సీఈఓ జాలిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు, జెడ్పీ కార్యాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

'నాకు దిక్కెవరూ లేరు.. నేనిక బతకను'


మృతి చెందిన రమాదేవి

కొత్తపట్నం: 'నాకు దిక్కెవరూ లేరు, నన్ను చూసేవారు లేరు. ఇంకా ఈ భూమ్మీద నేనెందుకు బతకాల'ని మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు బుధవారం మోటుమాల వద్ద సముద్రంలో పడి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామానికి చెందిన తుమ్మపూడి రమాదేవి(66) ఇంటి దగ్గరే ఉంటూ జీవనం గడుపుతోంది. బుధవారం తన కుమార్తెకు ఫోన్ చేసి 'ఇక నేను బతకను' అని చెప్పి మోటుమాల సముద్ర తీరం దగ్గరకు వెళ్లింది. అక్కడ కొద్దిసేపు కూర్చుని మదనపడింది. అంతలోనే సముద్రంలో పడటంతో అలల ధాటికి కొట్టుకుపోయింది. కాసేపటికే విగతజీవిగా ఒడ్డుకు చేరింది. ఈలోగా కుమార్తె వాణి తల్లిని వెతుకుతూ మోటుమాల సముద్ర తీరానికి వచ్చింది. అక్కడ తల్లి శవమై కనిపించడంతో బోరున విలపించింది. విషయాన్ని పోలీసులకు తెలియడంతో సంఘటనా స్థలానికి హెడ్‌కానిస్టేబుల్ పాండు, ఇతర సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నేడు కొండపిలో జాబ్ మేళా

కొండపి(జరుగుమల్లి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 15 బహుళ జాతీయ కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఎంపికైన వారికి కనీస వేతనం నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీ యువకులు బయోడేటాతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 6281205538, 8008822821ను సంప్రదించాలని కోరారు.

జెడ్పీ బడ్జెట్ రూ.33,68,59,732

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వెల్లడి
- జెడ్పీటీసీ సభ్యులతో సమీక్ష అనంతరం ఏకగ్రీవంగా ఆమోదం



బడ్జెట్ వివరాలు వెల్లడిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్‌కు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను అంచనా బడ్జెట్‌ను రూ.33,68,59,732తో సభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వెల్లడించారు. బుధవారం పాత జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఏర్పాటు చేశారు. 2వ స్థాయీ సంఘమైన గ్రామీణాభివృద్ధి శాఖపై, 1, 7 స్థాయీ సంఘాలైన పనులు, ఆర్థిక విషయాలపై, 4వ స్థాయీ సంఘమైన విద్య/వైద్య శాఖలపై ఉమ్మడి ప్రకాశం జిల్లా అధికారులు, జెడ్పీటీసీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. 3వ స్థాయీ సంఘమైన వ్యవసాయ కమిటీకి యన్నాబత్తిన అరుణ, 5, 6 స్థాయీ సంఘాల కమిటీలకు మారెడ్డి అరుణ, చుండి సుజ్ఞానమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ సాధారణ నిధులకు రూ.7.74 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమానికి రూ.5.05 కోట్లు, షెడ్యూల్ కులాల సంక్షేమానికి రూ.5.05 కోట్లు, ఆఫీస్ మేనేజ్‌మెంట్‌కు రూ.5.05 కోట్లు, షెడ్యుల్ తెగల సంక్షేమానికి రూ.2.02 కోట్లు.. ఇలా ఆయా కేటగిరీలకు మొత్తం రూ.33.68 కోట్లు కేటాయించినట్లు వివరించారు. గౌరవ సభ్యులతో చర్చించిన అనంతరం ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానం చేసినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్రను
జయప్రదం చేయండి


పాకల గ్రామంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

సింగరాయకొండ (మర్రిపూడి): సింగరాయకొండ మండలంలోని పాకల గ్రామంలో గురువారం నిర్వహించే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాకల గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడతారని చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, ఎమ్మార్వో సీహెచ్ ఉషా, ఎంపీడీఓ జమీ ముల్లా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'నిరీక్ష'ణేనా?

- ఆచూకీ లేని 9 నెలల చిన్నారి నిరీక్ష
- పాపను ఇస్తే పెంచుకుంటామని అడిగారని తల్లి వెల్లడి
- అపహరణకు ముందు రెండు రోజులపాటు నిందితుల రెక్కీ
- బైక్‌పై రిమ్స్ వరకు వచ్చినట్లు సీసీ ఫుటేజీలో గుర్తించిన పోలీసులు


సంతపేటలోకి వెళ్తున్న నిందితులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని కొప్పోలు రోడ్డులో ఈ నెల 26 అర్ధరాత్రి అపహరణకు గురైన 9 నెలల చిన్నారి దేవరకొండ నిరీక్ష ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. ఐదు రోజులుగా ప్రత్యేక పోలీస్ బృందాలతో గాలిస్తున్నా దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో తల్లిదండులకు నిరీక్షణే మిగిలింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక కొప్పోలు రోడ్డులోని రైల్వే ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జికి దిగువన నివాసం ఉంటున్న బాతుల కాపరికి చెందిన తొమ్మిది నెలల కుమార్తె నిరీక్ష అపహరణకు గురయిన విషయం విధితమే. చిన్నారి ఆచూకీ కోసం ఎస్పీ మలికగర్గ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో తాలూకా సీఐ వి.భక్తవత్సలరెడ్డితో కూడిన పోలీస్ బృందాలు నిరీక్ష కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. అయితే పాపను అపహరించిన పురుషుడు, మహిళ స్కూటర్‌పై కొప్పోలు రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ ముందు రోడ్డుకు, అక్కడ నుంచి రాత్రి 11.30 గంటల సమయంలో అగ్రహారం రైల్వే గేటు, సంతపేట సాయిబాబా గుడి, రత్నమహల్ ఎదురు రోడ్డులో నుంచి ట్రంకు రోడ్డు, అక్కడ నుంచి రిమ్స్ మొదటి గేటులో గుండా ఆస్పత్రిలోకి వెళ్లినట్లు సీసీ టీవీ పుటేజీల్లో పోలీసులు గుర్తించారు. అక్కడ నుంచి మరి ఎటువెళ్లారో పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. నిరీక్ష తల్లిదండ్రులు దేవరకొండ ఆనంద్ రజనిది నెల్లూరు జిల్లా గుడ్లూరు. వారు బాతులు మేపుతూ సంచార జీవనం సాగిస్తున్నారు. 15 రోజుల క్రితం ఒంగోలు చేరుకుని కొప్పోలు రోడ్డులో గుడారం వేసుకొని బాతులను మేపుకొంటున్నారు. ఇదిలా ఉండగా అపహరణకు ముందు రెండు రోజులపాటు నిందితులు వచ్చారని, శనివారం రోజున పాపను ఇస్తే పెంచుకుంటామని అడిగినట్లు పాప తల్లి రజని పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

దర్శి: బతుకుదెరువు కోసం వచ్చి తోటి కార్మికుడి చేతిలో హత్యకు గురయ్యాడు ఫిరోజ్ అన్సారీ. ఈ కేసులో నిందితుడు పోలీసులకు లొంగిపోగా దర్శి కోర్టులో హాజరుపరచడంతో 14 రోజులు రిమాండ్ విధించారని సీఐ రామకోటయ్య బుధవారం తెలిపారు. వివరాలు.. ఉత్తర ప్రదేశ్ నుంచి కార్పెంటర్ పని చేసేందుకు నలుగురు యువకులు దర్శికి వచ్చారు. స్థానికంగా బాదం మాధవరెడ్డి ఇంట్లో ఇంటీరియర్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్ వెళ్లగా ఫిరోజ్ అన్సారీ, దీపక్ సహాని దర్శిలోనే ఉండి పనులు చేస్తున్నారు. ఫిరోజ్ అన్సారీ మద్యం మత్తులో దీపక్ సహానీ సోదరి గురించి చెడుగా మాట్లాడటాన్ని జీర్ణించుకోలేకపోయాడు. పథకం ప్రకారం ఈనెల 7వ తేదీ రాత్రి ఇనుప కడ్డీతో అన్సారీ తల, ముఖంపై బలంగా కొట్టాడు. ఆ మరుసటి రోజు ఫిరోజ్ అన్సారీకి యాక్సిడెంట్ అయిందని వాచ్‌మెన్‌తోపాటు బాదం మాధవరెడ్డి బంధువు బాదం శ్రీనివాస రెడ్డిని నమ్మించే ప్రయత్నం చేశాడు. తీవ్రగాయాలతో పడి ఉన్న అన్సారీని శ్రీనివాసరెడ్డి తొలుత గుంటూరు జీజీహెచ్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ ఫిరోజ్ అన్సారీ ఈ నెల 23న మృతి చెందాడు. దీంతో దీపక్ సహాని భయపడి ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్ వచ్చి విషయాన్ని మేస్త్రీ పండిత్, రాజగోపాల్‌రెడ్డి అనే వ్యక్తులకు చెప్పాడు. వారి సూచన మేరకు దర్శి వీఆర్వో ద్వారా పోలీసులకు లొంగిపోయాడు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.